ఆంధ్రజ్యోతి

andhrajyothy.com మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.3 కనిష్ఠం 21.5



ఆదిలాబాద్ జిల్లా వార్తలు

5

బుధవారం 28 ఫిబ్రవరి 2024



'గిరి వికాసం'పై..

నీలినీడలు!

- జిల్లాలోని ఏజెన్సీ ప్రాంత బీడు భూముల సస్యశ్యామలం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శ్రీకారం
- ఆశించిన స్థాయిలో ముందుకు సాగని గిరి వికాసం పథకం
- పథకం అమలుపై అనుమానాలు
- నిధులు లేక ముందుకు సాగని వైనం
- గిరిజన గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అడుగడుగునా ఆటంకాలు
- ఆరేళ్లు గడుస్తున్నా.. రైతులకు తప్పని ఎదురుచూపులు
- మళ్లీ ఇంద్రజలప్రభ పథకం పేరుతో ముందుకు వెళ్లే ప్రయత్నాలు
- కాంగ్రెస్ కొత్త ప్రభుత్వం పైనే భారీ ఆశలు పెట్టుకున్న గిరిజన రైతులు
- జిల్లావ్యాప్తంగా 970 బోరు బావులు మంజూరు కాగా.. ఇప్పటి వరకు తవ్వినవి 546 మాత్రమే..

ఆదిలాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలోని బీడు భూములను సస్యశ్యామలం చేసేందుకు గత ప్రభుత్వం గిరివికాసం పథకానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలో ఈ పథకం అమలు తీరు ఓ అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కి అన్నట్లుగా మారింది. పథకాన్ని ప్రారంభించి ఆరేళ్ల గడుస్తున్నా.. ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. దీంతో ఈ పథకం అమలుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. దీంతో జిల్లావ్యాప్తంగా 10 వేల మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. 1,657 మంది రైతులను బోరువెల్ యూజర్ గ్రూప్స్‌గా ఏర్పాటు చేసి పథకం అమలును ప్రారంభించారు. ఇందులో ముగ్గురు, నలుగురు రైతులకు కలిపి ఒక్కో బోరుబావిని మంజూరు చేశారు. జిల్లాలో 970 బోరుబావులను మంజూరు చేయగా.. ఇప్పటి వరకు 546 బోరుబావులను మాత్రమే తవ్వించారు. ఇందులో 470 బోరుబావులకు విద్యుత్ కనెక్షన్ కోసం డీడీలు చెల్లించారు. 376 బోరుబావులకు మాత్రమే త్రిఫేజ్ కరెంట్‌ను సరఫరా చేశారు. కానీ కేవలం 200 బోరుబావులకు పంప్ మోటార్లను బిగించా రు. మిగితా బోరుబావులు సర్వే దశలోనే కనిపిస్తున్నాయి. ఏళ్ల తరబడి గిరివికాసం పథకం పడుతూ.. లేస్తూ సాగడంతో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ పథకం రూపురేఖలను పూర్తిగా మార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నా యి. జిల్లాలో 18 మండలాలకు గాను 16 మండలాల్లో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. అసలే జిల్లాలో అంతంతమాత్రంగా నీటి వనరులు అందుబాటులో ఉండడంతో.. ఎక్కువ వర్షాధార పంటలనే సాగు చేస్తున్నారు. సరైన నీటి వసతి లేక రెండో పంట రబీలో పంటల సాగును పూర్తిగా వదిలేస్తున్నారు. అయితే ఈ పథకాన్ని పూర్తిగా గిరిజన రైతుల సంక్షేమం కోసమే అమలు చేస్తున్నా.. ఆశించిన స్థాయిలో ప్రయోజనం కనిపించడం లేదంటున్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పైననే గిరిజన రైతులు భారీగా ఆశలు పెట్టుకుంటున్నారు.



మళ్లీ ఇంద్రజలప్రభతో ముందుకు..

గిరిజన రైతుల సంక్షేమం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన గిరివికాసం పథకాన్ని ఎత్తివేసి.. మళ్లీ ఇంద్రజలప్రభ పేరుతో ముందుకు వెళ్లే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ పథకాన్ని మార్పులు చేర్పులు చేసి అమలు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ఇంద్రజలప్రభ పేరిట గిరిజన రైతులకు బోరుబావులను తవ్వించి సాగునీటి సౌకర్యాన్ని కల్పించారు. మళ్లీ పదేళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇంద్రజలప్రభను తిరిగి అమలు చేసేందుకు కసరత్తు జరుగుతోంది. త్వరలోనే విధి విధానాలను ప్రకటించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ పథకం అమలుకు ఇప్పటి వరకు జిల్లాలో 13.50 కోట్ల రూపాయలను ఖర్చు చేశారు. మరో రూ.43 కోట్లు అవసరమని అధికారులు చెబుతున్నారు.

మంచి తరుణం మించిపోతోంది

గిరిజన రైతుల పంట చేలల్లో బోరు బావులను తవ్వించేందుకు వేసవి అనువైన సమయం కావడంతో.. వెంటనే చర్యలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అయితే నిధులు లేవన్న కారణంగా అధికారులు అంతగా ఆసక్తి చూపడం లేదు. ఏదో అడపాదడప బోరుబావులను తవ్వడం.. ఆపై వదిలేయడంతో పథక అమలుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డీఆర్డీఏ, ఐటీడీఏ, విద్యుత్, గ్రౌండ్‌వాటర్ శాఖల మధ్య సమన్వయం కొరవడుతోంది. నెల రోజుల్లో పూర్తయ్యే పనికి నెలల తరబడి జాప్యం జరుగుతూ వస్తుంది. వారం రోజుల్లోనే బోరుబావిని తవ్వి మోటార్‌ను బిగించే అవకాశం ఉన్నా.. అధికారులు ఎందుకు ఆలస్యం చేస్తున్నారో? అర్థం కావడం లేదంటున్నారు. మరో రెండు, మూడు మాసాల్లోనే వానాకాలం సీజన్ సమీపిస్తుండడంతో ఈ యేడైనా బోరు మోటార్లను బిగిస్తారో? లేదో?నన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

అనుమతులు ఆలస్యం

విద్యుత్ సరఫరా ఆలస్యమవుతుందని అధికారులు చెబుతున్నారు. ఎందుకంటే జిల్లాలో ఎక్కువ గిరిజన గ్రామాలు అటవీ ప్రాంతంలో ఉండడంతో విద్యుత్ సరఫరాకు అడుగడుగునా ఆటంకాలు ఏర్పడుతున్నాయి. అడవుల గుండా త్రిఫేజ్ విద్యుత్ సరఫరా కోసం స్తంభాలను వేసేందుకు అటవీ శాఖ అడ్డంకులు చెబుతున్నట్లు తెలుస్తుంది. విద్యుత్ శాఖ, డీఆర్డీఏ, అటవీ శాఖల మధ్య సమన్వయం కొరవడినట్లు కనిపిస్తుంది. ఇప్పటి వరకు 546 బోరుబావులను తవ్విన అధికారులు మాత్రం 200 బోరుబావులకు పంప్ మోటార్లను బిగించారు. వర్షాకాలానికి ముందే విద్యుత్ లైన్లను వేసుకుంటే బోరుమోటార్‌లను బిగించుకునే అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదంటున్నారు. విద్యుత్, అటవీ శాఖ అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారింది. ఇకనైనా ఐటీడీఏ అధికారులు గిరివికాసం పథకాన్ని ముందుకు తీసుకెళ్లాలని గిరిజన రైతులు కోరుతున్నారు.



● గిరి వికాసం పథకం కింద రైతుల పంట చేన్లలో వేసిన బోరుబావి



పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం

: సాయన్న, డీఆర్డీఏ పీడీ, ఆదిలాబాద్



జిల్లాలో గిరివికాసం పథకం అమలును పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకు రూ.13కోట్ల 50లక్షల నిధులను ఖర్చు చేయడం జరిగింది. మిగితా నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం. ఇప్పటికే ఈ పథకం అమలుపై ప్రభుత్వానికి నివేదించడం జరిగింది. ప్రభుత్వ ఆదేశాలతో మిగితా రైతుల పంట పొలాల్లో బోరుబావులను తవ్వించి విద్యుత్ సౌకర్యాన్ని కల్పిస్తాం. ఇప్పటికే మంజూరైన బోరుబావులను పూర్తిచేసే ప్రయత్నం చేస్తున్నాం.

సంక్షిప్త సమాచారం



క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే అనిల్

'బోథ్ నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి సహకరించండి'

బోథ్, ఫిబ్రవరి 27: బోథ్ నియోజకవర్గం పరిధిలోని ఇచ్చోడ, సోనాల రోడ్డు మార్గంలో ఉన్న అదేగామా, పిప్పరి గ్రామాల మధ్య రోడ్డు చెడిపోయిందని రోడ్డు నిర్మాణానికి సహకరించాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ మంగళవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ దృష్టికి తీసుకెళ్లారు. అంతేగాక నియోజకవర్గం తాగునీటి ఎద్దడి రాకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆడేగామా ప్రాజెక్టు కుడి కాలువ నిర్మాణంపైన దృష్టి సారించాలని కలెక్టర్‌ను కోరారు. భూగర్భ జలాల పెంపు కోసం అవసరమైనచోట కుంటలు, చెరువుల నిర్మాణం చేపట్టాలని కోరారు. గతంలో మంజూరైన చెక్ డ్యామ్‌ల నిర్మాణ పనులకు టెండర్ పిలవాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కోరారు.



మిషన్ భగీరథ ఇంటింటా నీటి కుళాయిలను పరిశీలిస్తున్న ఎంపీడీవో

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

తలమడుగు, ఫిబ్రవరి 27: రానున్న వేసవి కాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో శేఖర్ కోరారు. మంగళవారం మండలంలో కోసాయిదేగామ తదితర గ్రామాల్లో పర్యటించారు. అనంతరం గ్రామాల్లో సరఫరా అవుతున్న మిషన్ భగీరథ పనులను పరిశీలించి వివరాలు అడిగి గ్రామాలు ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ నల్లనీరు అక్రమంగా రావడం లేదని దేగామ గ్రామస్థులు ఎంపీడీవోకు విన్నవించారు. గ్రామాలలో మిషన్ భగీరథ పనులను త్వరగా పూర్తి చేసి తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలని, అదే విధంగా పారిశుధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్య నిర్మూలన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఆయా గ్రామాల్లో చేపడుతున్న నూతన గ్రామ పంచాయతీ భవన పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. అంతేకాకుండా పనుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ఇందులో ఎంపీవో వినోద్‌కుమార్, పంచాయతీ సెక్రెటరీ గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు

● నిమిషం ఆలస్యం నిబంధన కఠినంగా అమలు ● జిల్లావ్యాప్తంగా మొత్తం 30 పరీక్ష కేంద్రాల ఏర్పాటు ● మార్చి 19 వరకు పరీక్షలు



ఆదిలాబాద్‌లో టేబుళ్లపై హాల్‌టికెట్ నెంబర్లు వేస్తున్న అధికారులు



ఉట్నూర్ జూనియర్ కళాశాలలో హాల్ టికెట్ నెంబర్లు వేస్తున్న దృశ్యం

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 26: జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ఈ నెల 28నుంచి మార్చి 19వరకు జరుగనున్నాయి. ఈ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఇప్పటికే జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవీందర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పూర్తి చేశారు. పరీక్షల్లో ఎలాంటి చూచిరాతలకు ఆస్కారం లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించే ఈ పరీక్షలకు నిమిషం ఆలస్యం నిబంధన అమలు చేస్తున్నారు. అంతేకాకుండా విద్యార్థులు పరీక్షలకు దూరంకాకుండా సకాలంలో 8గంటలకు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచిస్తున్నారు. ఈ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 19,586 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరంలో 9577, ద్వితీయ సంవత్సరంలో 10,009 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. జిల్లాలో మొత్తం 30 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. అయితే పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్‌ను అమలు చేయనున్నారు.

● ఉట్నూర్‌లో ఆరు సెంటర్లు

ఉట్నూర్: బుధవారం నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఉట్నూర్ పట్టణంలో ఆరు పరీక్ష కేంద్రాలను జిల్లా ఇంటర్ బోర్డు అధికారులు ఏర్పాటు చేశారు. ఉట్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్ పావనికుమారి, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ వెంకటేశ్ ఆధ్వర్యంలో మంగళవారం పరీక్షలు రాసే విద్యార్థుల కోసం టేబుళ్లను సిద్ధం చేసి హాల్ టికెట్ నెంబర్లు కూడా వేశారు. ఆరు పరీక్ష కేంద్రాలలో 270 మంది ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు కాగా 315మంది ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉన్నారు. లాల్‌టెకిడి గురుకుల జూనియర్ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్ రామ్మోహన్, డీవోగా శ్రీలత, కేబీ కాంప్లెక్స్ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో సీఎస్‌గా సుమలత, డీవోగా శ్రీనివాస్, చైతన్య జూనియర్ కళాశాలలో సీఎస్‌గా ఉదయ్‌కుమార్, డీవోగా ప్రమీల, పూలాజీబాబా జూనియర్ కళాశాల సీఎస్‌గా రాథోడ్ శ్రావణ్‌నాయక్, డీవోగా సుజాత, ఏఆర్ఎస్ జూనియర్ కళాశాల సీఎస్‌గా కేశవ్, డీవోగా సుజాతలను నియమించారు.

బజార్‌హత్నూర్: మండలం పరిధిలో ప్రభుత్వ జూనియర్ కళశాల, ఆదర్శ కళాశాలల్లోని మొదటి, ద్వితీయ సంవత్సరం చదువుతున్న మొత్తం 430 మది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు సిద్ధంగా ఉన్నారు. వీరికి మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రంను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సునీల్ మాట్లాడుతూ బుధవారం మొదటి సంవత్సర విద్యార్థులు మొత్తం 288 మంది పరీక్ష రాసేందుకు అన్నిరకాలైన సౌకర్యాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు తెలుగు, హిందీ, ఉర్దూ పరీక్ష జరుగనుందన్నారు. పరీక్షలు రాసే విద్యార్థులు 30నిమిషాల ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. నిమిషం ఆలస్యమైన పరీక్షలకు అనుమతించవద్దు అన్న నిబంధన ఉండడం వల్ల ముందుగానే విద్యార్థులు చేరుకోవాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న డీఆర్‌వో, లీడ్ బ్యాంకు మేనేజర్



2కే రన్‌లో పాల్గొన్న అధికారులు, క్రీడాకారులు

బ్యాంకు సేవలపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

● 2కే రన్‌ను ప్రారంభించిన డీఆర్‌వో రమేష్ రాథోడ్

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 27: ప్రస్తుతం బ్యాంకు సేవలు ఎంత వేగంగా అందుబాటులోకి వచ్చాయో.. అంతేవేగంగా ఆన్‌లైన్ మోసాలు కూడా జరుగుతున్నాయని, వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జీ డీఆర్‌వో రాథోడ్‌రమేష్ అన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి 2కే రన్‌ను చేపట్టారు. దీనికి డీఆర్‌వో ముఖ్య అతిథిగా హాజరై క్రీడాజ్యోతిని వెలిగించగా డీఎస్‌వో వెంకటేశ్వర్లు జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్‌వో రమేష్ రాథోడ్ మాట్లాడుతూ ఆర్‌బీఐ ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా బ్యాంక్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించేలా మూడు రోజుల పాటు కార్యక్రమాలు చేపడుతుందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. నేటి ఆధునిక కాలంలో పెరుగుతున్న సాంకేతికత కారణంగా మోసాలు కూడా అదేస్థాయిలో పెరుగుతున్నాయని ఆయన అన్నారు. అంతేకాకుండా బ్యాంకు నుంచి ఎలాంటి మెసేజ్ వచ్చిన వెంటనే వాటిని సంబంధిత బ్యాంకుకు వెళ్లి సరిచూసుకోవాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం రన్‌లో పాల్గొన్న వారికి టీ షర్టులు, టోపీలు అందించారు. ఇందులో లీడ్ బ్యాంకు మేనేజర్ భాస్కర ప్రసాద్, జిల్లా బ్యాంకు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మేడిగూడ(ఆర్) పాఠశాలలో మాట్లాడుతున్న డీఈవో ప్రణీత

బట్టి విధానంతో మార్కులు సాధించలేరు

● జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత

జైనథ్, ఫిబ్రవరి 27: జిల్లాలోని ఆయా గ్రామాల్లో గల ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల బట్టి విధానంతో మార్కులు సాధించలేరని జిల్లా విద్యాశాఖ అధికారి టీ.ప్రణీత అన్నారు. మంగళవారం మండలంలోని మేడిగూడ(ఆర్) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులు విశ్లేషణ శక్తి పెంపొందించుకుని పరీక్షను స్వంతంగా రాసే విదంగా తయారు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖస ఎక్టోరియల్ అధికారి జెట్టి నారాయణ, హెచ్ఎం సత్యవాన్ చిక్కెలతో పాటు పాఠశాల పదవ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీఎస్పీని కలిసిన సీపీఎం నాయకులు

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 27: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ జీవన్ రెడ్డిని సీపీఎం పార్టీ బృందం నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు బండిదత్తాత్రి,జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లంకరాఘవులు, పూసంసచిన్,జిల్లా కమిటీ సభ్యులు బొజ్జుఆశన్న,జిల్లా నాయకులు అగ్గిమల్ల స్వామి,లింగాల చిన్నన్న పాల్గొన్నారు.

రెండు గ్యారెంటీల అమలుపై హర్షం

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 27: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మెనిఫెస్టోలో ప్రకటించిన విధంగా మరో రెండు గ్యారెంటీలను అమలుకు శ్రీకారం చుట్టడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశాయి. ఆదిలాబాద్ పట్టణంలోని కంది శ్రీనివాస్‌రెడ్డి ప్రజాసేవా భవన్‌లో ఆయన ఆదేశాల మేరకు ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లుభట్టివిక్రమార్క ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతీ ఒక్క పథకాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చిందని పార్టీజిల్లా నాయకులు అన్నారు. తాజాగా గృహజ్యోతి పథఖం కింద రూ.500గ్యాస్‌సిలీండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జైనథ్ జడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ ముడుపు దామోదర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దిగంబర్‌రావు పాటిల్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లి నగేష్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు మునిగెల నర్సింగ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్, మైనార్టీ నాయకులు ఎంఎ షకీల్, కిజర్‌పాషా, తదితరులు పాల్గొన్నారు.



రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముఖంపై స్ప్రే చేసి నగదు కొట్టేసిన దుండగులు

భైంసా రూరల్, ఫిబ్రవరి 27: మండలంలోని వానల్‌పాడ్ గ్రామానికి చెందిన ఠాకూర్ అవినాష్ ముఖంపై స్ప్రే చేసి రూ. 60 వేల నగదును దుండగులు తీసుకెళ్లారు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం వానల్‌పాడ్ గ్రామానికి చెందిన ఠాకూర్ అవినాష్ తన సొంత పనుల నిమిత్తం భైంసా ఏటీఎం నుంచి రూ. 60 వేలను డ్రా చేసుకొని ఇంటికి వెళ్తుండగా మాటేగాం టోల్‌ప్లాజా వద్ద బైక్‌పై వచ్చిన దుండగుడు నిర్మల్‌కు వెళ్లే దారి ఇదేనా అని అడుగుతూ ముఖ్యంపై స్ప్రే చేశాడు. స్పృహ కోల్పోగానే అతని దగ్గర ఉన్న రూ. 60 వేలను తీసుకుపోయినట్లు బాధితుడు తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

మద్యానికి బానిసై ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

భైంసా రూరల్, ఫిబ్రవరి 27 : మండలంలోని మహాగాం గ్రామంలో మంగళ వారం రాజేశ్వర్ అనే రైతు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం... మహాగాం గ్రామానికి చెందిన రాజేశ్వర్ (32) గత కొద్ది రోజుల నుంచి మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య సృజన పిటిషన్ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

రేపు నర్సాపూర్(జి)లో కబడ్డీ జట్టు ఎంపిక పోటీలు

భైంసా, ఫిబ్రవరి 27 : మండల కేంద్రమైన నర్సాపూర్ (జి)లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో గురువారం పురుషుల సీనియర్ జిల్లా స్థాయి కబడ్డీ జట్టు ఎంపిక పోటీలు జరుగనున్నాయి. నిర్మల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జట్టు ఎంపిక కొరకు జరుగనున్న పోటీలలో ఆసక్తి గల క్రీడాకారులు పాల్గొనాలని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు భూపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.సునీల్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రేమలతలు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీలలో పాల్గొనే క్రీడాకారుల బరువు 85 కిలోల లోపు ఉండి ఆధార్ కార్డు, రూ.100 ప్రవేశ రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 2వ తేది నుంచి 4 వ తేది వరకు నల్గొండ జిల్లా నాగర్జునసాగర్‌లో జరిగే రాష్ట్ర కబడ్డీ పోటీలలో నిర్మల్ జిల్లా జట్టు తరపున పాల్గొనాల్సి ఉంటుందని వివరించారు. గురువారం ఉదయం 9 గంటల నుంచి ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని ఆసక్తి గల క్రీడాకారులు పూర్తి వివరాల కోసం గాను సెల్ నెంబరు 6301843139 , 9908970203 సంప్రదించాలని జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు ప్రకటనలో పెర్కొన్నారు.

లోకేశ్వరంలో ఒకరి బలవన్మరణం

లోకేశ్వరం, ఫిబ్రవరి 27: మద్యం తాగుడికి బానిసైన వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన లోకేశ్వరం మండలంలో జరిగింది. ఏఎస్సై దిగంబర్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని హద్గాం గ్రామానికి చెందిన ఇరగ దిండ్ల పోశెట్టి(58) అనే వ్యక్తి గత ఏడు సంవత్సరాల నుండి మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో సోమవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని, భార్య పీరవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ మాట తప్పింది

- ఫీజు లేకుండా క్రమబద్ధీకరించాలి
- తాగునీటిలోనూ లాభం వెతుకుతారా?
- ఇలాంటి వ్యక్తి సీఎం కావడం దురదృష్టకరం
- ప్రభుత్వమంటే రియల్ వ్యాపారం కాదు: హరీశ్



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి రాగానే ఎల్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేస్తామని, ఉచితంగా స్థలాలను క్రమబద్ధీకరిస్తాం అంటూ ప్రజలను రెచ్చగొట్టిన కాంగ్రెస్.. ఇపుడు మాట తప్పి ఫీజు వసూలు చేసేందుకు సిద్ధమైందని మాజీ మంత్రి టి.హరీశ్ రావు ఆరోపించారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో మంగళవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని, లేదంటే మోసపూరిత హామీ ఇచ్చినందుకు ప్రజలకు కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హామీల అమలుపై మాట మార్చడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని.. ఇది వారి మోసపూరిత విధానాలకు నిదర్శనమని విమర్శించారు. ఆ పార్టీ నేతలకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. గతంలో చేసిన ప్రకటనలకు అనుగుణంగా ఎల్‌ఆర్‌ఎస్‌ను ఎలాంటి ఫీజులు లేకుండా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు..ప్రజలకు అందించే స్వచ్ఛమైన తాగునీటిలోనూ లాభం వెతుకుతారా..? మిషన్ భగీరథ పథకంలో లాభం వెతికే వ్యక్తి ముఖ్యమంత్రి కావడం మన దురదృష్టమని హరీశ్‌రావు పేర్కొన్నారు. భగీరథ ద్వారా ఏం లాభం తెచ్చారని.. దానికోసం తెచ్చిన అప్పుపై వడ్డీ ఎలా కడతారని ఆయన ప్రశ్నించడం అంతకన్నా దౌర్భాగ్యం, భావదారిద్ర్య ఆరోపణ మరొకటి ఉండద మంగళవారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.ప్రభుత్వమంటే రియల్ ఎస్టేట్ వ్యాపారం కాదు.. ప్రజా సంక్షేమంలో లాభనష్టాలు చూసుకోరని రేవంత్‌రెడ్డిపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. మిషన్ భగీరథ పథకాన్ని ప్రజల ఆరోగ్యం కాపాడిన గొప్ప సంజీవనిగా చూడాలని.. అందులో లాభనష్టాలు బేరీజు వేసుకోవడం ఒక ప్రభుత్వాధినేతకు తగదని హితవుపలికారు. ఆసరా పెన్షన్ల ద్వారా కూడా రూ.వేలకోట్లు ఖర్చవుతుంది. దాని వల్ల కూడా లాభం లేదంటారా..? అని ప్రశ్నించారు.

మీ ఎత్తు గురించి నేను మాట్లాడితే..!

'ఇటీవల పలు సందర్భాల్లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిసారి నా ఎత్తు గురించి వ్యాఖ్యానిస్తున్నారు. నేను కూడా మీ (సీఎం రేవంత్‌ను ఉద్దేశించి) ఎత్తు గురించి మాట్లాడితే సంస్కారవంతంగా ఉండదు. ఎవరి ఎత్తు ఎంత అనేది ప్రజలకు అవసరం లేదు. ప్రజల కోసం ఎవరు ఎంతమేరకు ఆలోచిస్తున్నారో.. ఎవరెంత పనిచేస్తున్నారో.. మాత్రమే వారికి అవసరం' అని హరీశ్‌రావు వెల్లడించారు.

కాంగ్రెస్ వస్తే ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేస్తామన్నారు కదా?: టీఆర్‌ఏ

ఇప్పుడు ప్రభుత్వంలో ఉన్న ముఖ్యమంత్రితోపాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేస్తామని ప్రకటనలు చేశారని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ (టీఆర్‌ఏ) అధ్యక్షుడు నారగోని ప్రవీణ్ కుమార్ గుర్తు చేశారు. "గత ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ కింద రుసుము వసూలుకు ప్రతిపాదనలు చేస్తే.. లేఅవుట్ రెగ్యులేషన్ స్కీమ్ లాగే మ్యారేజ్ రెగ్యులేషన్ స్కీమ్ కూడా తీసుకొస్తారేమో అని గతంలో రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఇప్పుడేమో సీఎం హోదాలో అదే పథకాన్ని అమలు చేసేందుకు రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేయాలని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేయగా గతంలో కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. ఇప్పుడు ఇదే ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ తెరమీదకు తెచ్చి మార్చి 31లోగా గడువు విధించి రెగ్యులరైజేషన్ చేయించుకోవాలని చెప్పడం సమంజసంగా లేదు" అని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

తెలంగాణలో 17 సీట్లూ బీజేపీ గెలవాలి

హైదరాబాద్ సీటును కూడా కైవసం చేసుకోవాలి.. అసదుద్దీన్ పార్లమెంటుకు వెళ్లకుండా అడ్డుకోవాలి

- విజయ సంకల్ప యాత్రలో కిషన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ/కార్వాన్/నిజామాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాల్లోనూ బీజేపీ గెలవాలని, మజ్లిస్ సీటును కూడా కైవసం చేసుకుని అసదుద్దీన్ ఒవైసీ పార్లమెంటుకు వెళ్ళకుండా అడ్డుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజాసామ్యానికి, అభివృద్ధికి వ్యతిరేకంగా మజ్లిస్ పార్టీ పనిచేస్తుందని, మెట్రో రైలు ప్రాజెక్టును అడ్డుకుంటుందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే దాని పంచన చేరి పోలీసు వ్యవస్థను తన ఆధీనంలో పెట్టుకుంటుందని విమర్శించారు. మంగళవారం కిషన్ రెడ్డి హైదరాబాద్‌లో రెండో రోజు విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. గుడిమల్కాపూర్ జైన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్వాన్, గోషామహల్, చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో యాత్ర కొనసాగింది. జుమ్మేరాత్ బజార్‌లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. బీజేపీకి ముఖ్యంగా హైదరాబాద్ లోక్‌సభ సీటు గెలవాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పాలనలో 12 లక్షల కోట్ల అవినీతి జరిగిందని, మోదీ ఒక్క రూపాయి కూడా అవినీతి లేకుండా పాలన కొనసాగిస్తున్నారన్నారు. ప్రపంచంలో భారతదేశ ప్రతిష్ఠను పెంచారన్నారు. రాష్ట్రంలో 17 లోక్‌సభ, 114 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 5500 కిలోమీటర్ల మేర ఐదు విజయ సంకల్ప యాత్రలు కొనసాగుతాయని తెలిపారు. వచ్చే నెల 2వ తేదీతో ముగుస్తాయన్నారు. మోదీ మళ్లీ ప్రధాని కావాలని ఈ యాత్రలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కాగా, నిజామాబాద్ జిల్లా బాల్కొండ, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్ నియోజకవర్గాల్లో జరిగిన యాత్రలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పాల్గొన్నారు. కేంద్రంలో మూడోసారి బీజేపీయే అధికారంలోకి వస్తుందని, మోదీ మళ్లీ ప్రధాని అవుతారని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మోదీ రైతుల కోసం పసుపు బోర్డు ఏర్పాటు చేసి హామీ నెరవేర్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ నామమాత్ర మెజారిటీతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పటికీ ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా కాంగ్రెస్‌కు ఆదరణ లేదని, కేంద్రంలో ఆ పార్టీ అధికారంలోకి రావడం కలేనని వ్యాఖ్యానించారు.



విజయ సంకల్ప యాత్రలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న దృశ్యం

తల్లిని అడ్డు పెట్టుకొని రాజకీయాలు

పొన్నం తల్లిని నేను అవమానించలేదు.. యాత్రను ఆపేయాలనుకుంటే కాంగ్రెస్‌కే నష్టం

- హామీల అమలును ప్రశ్నిస్తే దాడులా?
- నేను ఓడిపోతే.. రాజకీయ సన్యాసం
- కాంగ్రెస్ ఓడితే పొన్నం తప్పుకుంటారా?
- కేటీఆర్‌తో బీఆర్ఎస్..

పొన్నంతో కాంగ్రెస్ నాశనం: సంజయ్

హుస్నాబాద్, ఫిబ్రవరి 27: కన్న తల్లిని అడ్డుపెట్టుకొని మంత్రి పొన్నం ప్రభాకర్ రాజకీయం చేయాలనుకుంటున్నాడని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ విమర్శించారు. 'రాముడు అయోధ్యలోనే పుట్టాడా..?' అని అడిగిన వారిని ప్రశ్నించాను తప్ప.. పొన్నం తల్లిని ఉద్దేశించి అనలేదని వివరణ ఇచ్చారు. అందరు తల్లులు తన తల్లితో సమానమని.. ప్రభాకర్ తల్లిని తాను అవమానించలేదని స్పష్టం చేశారు. తాను అంత సంస్కార హీనుడిని కారని అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ అంబేడ్కర్ చౌరస్తాలో జరిగిన ప్రజాహిత యాత్ర బహిరంగ సభలో సంజయ్ మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చేలోగా కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోతే.. అడుగడుగునా నిలదీస్తూనే ఉంటామని హెచ్చరించారు. హామీల అమలుకు ఇంకా 20 రోజులే గడువు ఉందన్నారు. రేషన్ కార్డులు ఉన్న వారికే పథకాలు ఇస్తామని చెబుతున్నారని.. రేషన్ కార్డులు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. తాను హామీల అమలును ప్రశ్నిస్తే.. కాంగ్రెస్ దాడులు చేయించడం ఏంటని ప్రశ్నించారు. పొన్నం ప్రభాకర్ ఏమీ చేయలేదు కాబట్టే గత ఎంపీ ఎన్నికల్లో మూడో స్థానం వచ్చిందని తెలిపారు. అయోధ్య అక్షింతలను రేషన్ బియ్యం అని ఆయన అన్నది వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు. ప్రజాహిత యాత్రను ఆపాలనుకుంటే కాంగ్రెస్‌కే నష్టమని హెచ్చరించారు. కేసీఆర్ పదేళ్లలో రూ.5 లక్షల కోట్ల అప్పు చేస్తే, కాంగ్రెస్ 2 నెలల్లో రూ.10వేల కోట్ల అప్పు చేసిందని విమర్శించారు. తల్లిని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నందుకు స్వర్గంలో ఉన్న పొన్నం తల్లి ఆత్మ ఎంత క్షోభిస్తుందోనని సంజయ్ అన్నారు. అయితే, పక్కనే ఉన్న నాయకులు పొన్నం తల్లి బతికే ఉందని.. తండ్రి చనిపోయాడని తెలిపారు. దీంతో పొరపాటును గుర్తించిన సంజయ్.. పొన్నం తండ్రి ఆత్మ ఎంత క్షోభిస్తుందోనని అన్నారు. ఆయన తల్లి నూరేళ్లు ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. 'రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రికి సవాల్ విసురుతున్నా.. నేను నా విశ్వాసాలతో రాముడి పేరిట ఎంపీ ఎన్నికల్లో నిలుచుంటా. నువ్వు నీ వాదనతో అభ్యర్థిని నిలబెట్టు. నేను ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటా. మళ్లీ రాముడని, హిందూ మతమని మాట్లాడను. మీ అభ్యర్థి ఓడితే రాజకీయాల నుంచి తప్పుకుంటావా..?' అని బండి సంజయ్ పేర్కొన్నారు. కేటీఆర్‌తో బీఆర్ఎస్ నాశనమైందని, పొన్నం లాంటి వారితో కాంగ్రెస్ నాశనమవుతుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉచితంగా రేషన్ బియ్యం ఇస్తుంటే మీ ఫొటోలు పెట్టుకుంటారా.. తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వమే ఉచితంగా బియ్యం ఇస్తోందని, ఇక్కడికి బియ్యం పంపవద్దని ప్రధాని మోదీకి లేఖ రాస్తా' అని అన్నారు.



ప్రజాహిత యాత్ర బహిరంగ సభలో సంజయ్

సంజయ్ క్షమాపణ చెప్పాలి

కాంగ్రెస్ శ్రేణుల డిమాండ్

పాదయాత్ర శిబిరాన్ని ముట్టడించే యత్నం

చిగురుమామిడి/హుస్నాబాద్ రూరల్: సంజయ్ చేపట్టిన ప్రజాహిత యాత్ర మంగళవారం ఉద్రిక్త వాతావరణంలో సాగింది. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని హుస్నాబాద్ కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. సంజయ్ ప్రజాహిత యాత్రను అడ్డుకునే ప్రయత్నం చేశారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లిలో సోమవారం రాత్రి సంజయ్ బస చేశారు. మంగళవారం ఉదయం అక్కడికి తరలి వచ్చిన కాంగ్రెస్ నాయకులు సంజయ్ బస చేసిన శిబిరాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. అక్కడ ఉన్న బీజేపీ నాయకులు వారిని ప్రతిఘటించారు. పోలీసులు ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. దీంతో ఉల్లంపల్లి శివారులోని ప్రధాన రహదారిపై కాంగ్రెస్ కార్యకర్తలు బైఠాయించారు. కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కరీంనగర్ జిల్లా సరిహద్దు నుంచి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని రాములపల్లి వరకు పాదయాత్రను పోలీస్ బందో బస్తుతో తీసుకెళ్లారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. కరీంనగర్‌లో రాస్తారోకో చేశారు. పలుచోట్ల సంజయ్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఎంపీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాహిత యాత్ర మంగళవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలానికి వస్తున్న క్రమంలో సంజయ్‌కి స్వాగతం పలుకుతూ బీజేపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై కాంగ్రెస్ కార్యకర్తలు అనుచిత రాతలు రాశారు. దీనిపై బీజేపీ నేతలు ముల్కనూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యాత్ర పేరిట 'బండి' రాజకీయ డ్రామాలు

- నా తల్లిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు
- ఎంపీగా అయిదేళ్లలో ఏం చేశారో చెప్పాలి
- సంజయ్ ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడు : మంత్రి పొన్నం



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి)/హుస్నాబాద్: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ రాజకీయ డ్రామాలతో ప్రజాహిత యాత్ర చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఆయన గాంధీ భవన్‌లో, సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. తన తల్లిపై బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై మండిపడ్డారు. ఎంపీగా ఐదేళ్ల పదవీ కాలంలో సంజయ్ కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నిస్తే.. ఆయన తన తల్లి జన్మకు సంబంధించి వ్యాఖ్యలు చేశారని, ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేవలం ప్రచారం కోసమే సంజయ్ తన యాత్రను కాంగ్రెస్ అడ్డుకున్నట్లు డ్రామాలకు తెరలేపారన్నారు. తాము వాళ్ల యాత్రలు అడ్డుకోవడం లేదని, ప్రజాస్వామ్యంలో యాత్ర చేసే హక్కు అందరికీ ఉంటుందని, కానీ అవివేకమైన మాటలు సరికాదని విమర్శించారు. తనకు శ్రీరాముడు అంటే గౌరవం అని, ఏనాడు శ్రీరాముడి గురించి కాని, అక్షింతల గురించి గాని మాట్లాడలేదని, ఒకవేళ మాట్లాడినట్లు నిరూపిస్తే సజీవ సమాధికి సిద్ధమని సవాల్ విసిరారు. తన మాటలను వక్రీకరించి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. శ్రీరాముని పేరు మీద ఓట్లు అడగడం కాదు.. అయిదేళ్ల కాలంలో కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ నియోజకవర్గ ప్రజలకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సంజయ్ వ్యాఖ్యలపై బీజేపీ కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలు ఆలోచించాలన్నారు. ఇలాంటి నాయకుని డ్రామాలను సమర్థిస్తున్నారా..? అని ప్రశ్నించారు. సంజయ్ ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని మంత్రి హెచ్చరించారు.



కలశం ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

ఘనంగా శిఖర కలశం ఊరేగింపు

నేరడిగొండ, ఫిబ్రవరి 27: శ్రీరాజరాజేశ్వర స్వామి నవగ్రహ ధ్వజ శిఖర మందిర ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా మొదటి రోజు మంగళవారం రోజున ప్రవణ పతకా ఆవిష్కరణలో భాగంగా మండలకేంద్రంలోని పురవిధుల గుండా ఆలయ శిఖర ఊరేగింపు జరిగింది. కలశ శోభాయాత్రలో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పాల్గొని కళశాన్ని ఊరేగించారు. కుంటాల రోడ్డుకు సమీపంలో నూతన శివాలయం నిర్మించడం మండలానికి కళ సంతరించుకుందన్నారు. ఎలుకుచి శ్రవణ్‌కుమార్ జోషి, రమేష్ పంతులు బృందం మంత్రోచ్ఛరణ మధ్య ప్రతిష్ఠపన కార్యక్రమం కొనసాగుతుంది. ఈ కార్యక్రమంలో ఆలయ దాత సుధాకర్‌రెడ్డి దంపతులు, ఎంపీపీ రాథోడ్ సజన్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రమణ, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి లోకనిరీష్‌రెడ్డి, అవనీష్‌రెడ్డి, చాతాల భోజన్న, శ్రీనివాస్, నాగిరెడ్డి, ప్రతాప్‌సింగ్, గులాబ్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

'విజ్ఞాన మేళాతో మెదడుకు పదును'

బోథ్, ఫిబ్రవరి 27: విజ్ఞాన మేళాలతో విద్యార్థుల మెదడుకు పదును పెట్టినట్లు అవుతుందని బోథ్ మెజిస్ట్రేట్ బి.హుస్సేన్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వేదం పాఠశాలలో నిర్వహించిన విజ్ఞాన మేళాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో భూమారెడ్డితో కలిసి విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల మోడల్స్ పరిశీలించారు. ముఖ్యంగా చంద్రయాన్ -3 సోలార్ సిస్టమ్ బయోగ్యాస్ అగ్ని పర్వతం వాటర్ సైకిల్ కూరగాయాలతో డిఫెన్స్ తదితర ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. నిత్య జీవితంలో సైన్స్ అవసరాన్ని ఎంఈవోతో పాటు న్యాయమూర్తి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.సంతోష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు'

తలమడుగు, ఫిబ్రవరి 27: విద్యార్థులకు చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని క్లస్టర్ ఇన్‌చార్జీ కృష్ణకుమారి అన్నారు. మంగళవారం మండలంలోని ప్రాథమిక పాఠశాల లచ్చంపూర్ విద్యార్థులకు పరీక్షలు రాయడానికి అవసరమయ్యే స్టేషనరీని పరీక్షలు రాయడానికి ప్యాడ్లు, పెన్సిళ్లు, షాప్‌నర్లు పెన్నులను విద్యార్థులకు కృష్ణకుమారి-విలాస్‌గౌడ్ దంపతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విలాస్‌గౌడ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నవీన్‌యాదవ్, ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

29న కోరటలో విగ్రహ ప్రతిష్ఠాపన

జైనథ్, ఫిబ్రవరి 27: మండలంలోని కోరట గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో శివపార్వతులు, గణపతి, లక్ష్మీనాగేషుడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలు మంగళవారం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రతిష్ఠాపకులు దుబేసాయికృష్ణ శర్మ ఆధ్వర్యంలో గోపూజ గురువందనం, గణపతిపూజ, పుణ్యావాచనము, దీక్షాదారణము మంగళహారతి, జలాలి వాసము, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 29వ తేదీ గురువారం మంత్రస్థాపన విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించనున్నట్లు కోరట గ్రామ నిర్వాహకులు తెలిపారు. పెన్‌గంగా నదిపై మరో కాశీగా ఉన్న ఉత్తరవాహినికి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఇందుకు జిల్లా అధికార యంత్రాంగం తగు చర్యలు తీసుకోవాలని కోరట గ్రామస్థులు కోరారు.

పూర్తిస్థాయిలో సోయా కొనుగోళ్లు చేపట్టాలి

● ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రహ్లాద్ ● బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మార్కెట్ యార్డులో నాయకుల నిరసన



మార్కెట్ యార్డులో నిరసన చేపడుతున్న బీఆర్ఎస్ నాయకులు



జైనథ్ మార్కెట్ యార్డులో సోయాలను పరిశీలిస్తున్న నాయకులు

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 27: బీఆర్ఎస్ హయాంలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా పంటలను కొనుగోలు చేశామని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మాత్రం సోయా కొనుగోళ్లు జరుగడం లేదని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రహ్లాద్ ఆరోపించారు. మంగళవారం మార్కెట్ యార్డును సందర్శించి కొనుగోళ్ల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 24న కొనుగోళ్లు ప్రారంభమైన ఇప్పటి వరకు గింజ కూడా కొనుగోలు చేయలేదని రైతుల ద్వారా తెలుసుకున్నామన్నారు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని మార్కెట్ యార్డు ఎదుట నినాదాలు చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో రైతులకు పంట సాగుతో పాటు విక్రయాలకు కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూశామన్నారు. ఆర్భాటంగా సోయా కొనుగోళ్లను చేపట్టి మూడు రోజుల్లో ఒక గింజ కూడా తీసుకోలేదని ఆరోపించారు. రైతులకు అండగా బీఆర్ఎస్ ఉండి మద్దతుధరతో కొనుగోలు చేసేంత వరకు ఉద్యమిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎంపీపీ గండ్రత్ రమేష్, బీఆర్ఎస్ నాయకులు రోకండ్ల రమేష్, జగదీశ్, కుమ్ర రాజు, తదితరులు పాల్గొన్నారు.

● సోయా కొనుగోళ్ల నిలిపివేతపై మండిపడ్డ నాయకులు

జైనథ్: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ప్రతీ పంట గింజను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కొనుగోలు చేసిందని, ప్రస్తుతం సోయాను కొనుగోలు చేస్తామనడం సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని ఎంపీపీ, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ సర్సన్ లింగారెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో మంగళవారం నిలిచిపోయిన సోయా కొనుగోలు కేంద్రాన్ని అధికారులు నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 24న సోయా కొనుగోలు చేసి వర్షం పేరుతో అపివేశారని మండిపడాటరు. రాబోయే రోజుల్లో సోయాబీన్, శనగలు ప్రభుత్వ రంగ సంస్థల కొనుగోలు చేయకపోతే రాష్ట్ర జిల్లా వ్యాప్త ఆందోళన రాస్తారోకో చేస్తాయని ఆయన హెచ్చరించారు.

'పెండింగ్ భూసేకరణ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి'

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 27: జిల్లాలో భూ సేకరణ పెండింగ్ కోర్టు కేసులు, తీర్పు వచ్చిన కేసుల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నీటి పారుదల, రోడ్లు భవనాల శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఇందులో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీఆర్‌వో గంగయ్య, నీటి పారుదల శాఖ ఎస్ఈ సుశీల్, తదితరులున్నారు.

పాఠశాలల్లో డీఈవో ఆకస్మిక తనిఖీలు

నర్సాపూర్(జి), ఫిబ్రవరి 27: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల, చాక్‌పల్లి గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలను మంగళవారం డీఈవో రవీందర్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షల కేంద్రంలో సౌకర్యాల గురించి ఆరా తీశారు. మధ్యాహ్న భోజన కార్మికులతో మాట్లాడి విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని సూచించారు. చాక్‌పల్లి ఉర్దూ పాటశాలలో ఆంగ్ల మాధ్యమం వచ్చే సంవత్సరం నుంచి ఏర్పాటు చేస్తామని తెలిపారు. పిల్లలకు ప్రభుత్వం చట్టపరంగా అందించే హక్కులను ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పరీక్షల సహాయ కమిషనర్ సిద్ద పద్మ, ఎఈవో శంకర్, హెచ్ఎం కిషన్‌రావ్, అబ్దుల్ ఖాదర్, పంచాయతీ కార్యదర్శి నరేష్, సయ్యద్ కలీం పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ అవార్డుకు విద్యార్థిని ఎంపిక

లోకేశ్వరం, ఫిబ్రవరి 27: మండలంలోని పిప్రి ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం విద్యనభ్యసించిన విద్యార్థిని రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.అశోక్ కుమార్ తెలిపారు. విద్యార్థిని వేంపల్లి స్పందన తయారు చేసిన 'మోడర్న్ రోడ్ సైడ్ బేరియర్స్' ప్రాజెక్టు రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికైందన్నారు.

బులేరో వాహనం ఢీ : ఒకరి మృతి

నర్సాపూర్(జి), ఫిబ్రవరి 27: మండలంలోని అర్లి(కె) ఎక్స్‌రోడ్డు వద్ద మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికులు, పోలీసులు వివరాల ప్రకారం.. భైంసా నుంచి నర్సాపూర్(జి) గ్రామానికి వస్తున్న దేశాయ్ బీడీ కంపెనీకి చెందిన బులేరో (టీఎస్16ఈఎస్2871) వాహనం, అర్లి(కె) ఎక్స్ రోడ్డు వద్దగల పెట్రోలు పంపు నుంచి కల్లూరు వైపు పని నిమిత్తం ద్విచక్ర వాహనం (టీఎస్18ఏ0497)పై వెళ్తున్న అర్లి(కె) గ్రామానికి చెందిన మగ్గిడి సుధాకర్(40)ను ఢీ కొట్టింది. దీంతో ఆయన ఎడమ కాలుకు, ఛాతీలో తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వైద్యం కోసం నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో మృతి చెందాడు. భార్య మగ్గిడి సవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. కాగా, మగ్గిడి సుధాకర్ టీఎస్ఎన్‌పీడీసీఎల్ భైంసా మిషన్ భగీరథలో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

టిప్పర్, లారీ ఢీ : తప్పిన ప్రాణాపాయం

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 27 : నిర్మల్ పట్టణం శాంతినగర్ చౌక్ వద్ద మంగళవారం టిప్పర్, లారీ ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. మొరం లోడుతో వెళ్తున్న టిప్పర్, ఇసుక రవాణా చేస్తున్న లారీలు రద్దీగా ఉండే చౌరస్తాలో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంతో క రెండు వాహనాలు రెండు నుజ్జునుజ్జు అయ్యాయి. కాగా, తృటిలో ప్రాణాపాయం తప్పడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు.

'కఠినంగా శిక్షించాలి'

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 27: బాసర ట్రిపుల్ ఐటీలో గంజాయి సరఫరాకు సహకరించిన వారిని కఠినంగా శిక్షించాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కే. ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, సెక్యూరిటీ పెంచాలన్నారు. పట్టణ కన్వీనర్ జే. సాయిచరణ్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

'జాబితా నుంచి తొలగించే వరకు పోరాటం'

బోథ్, ఫిబ్రవరి 27: ఎస్టీ జాబితా నుంచి లంబాడాలను తొలగించేంత వరకు ఉద్యమాలు చేపడుతూనే ఉంటామని తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి నగేష్ పేర్కొన్నారు. మంగళవారం సిరికొండ పోలీస్‌స్టేషన్‌లో తుడుం దెబ్బ నాయకులపై పెట్టిన కేసు విచారణ సందర్భంగా బోథ్ కోర్టుకు రావడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కేసు న్యాయపోరాటం సుప్రీం కోర్టుకు అప్పిల అయినందున తుడుం దెబ్బ ఆధ్వర్యంలో సామాజిక ఆదివాసీ హక్కుల పోరాటం, న్యాయ పోరాటాలను సాధించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

'పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి'

తలమడుగు, ఫిబ్రవరి 27: గత రెండు, మూడేళ్ల నుంచి రబీ(యాసంగి)లో తెల్లజొన్న పంట సాగుపై రైతుల ఆసక్తి ఉందని, రైతులు పండించిన పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసే చర్యలు చేపట్టాలని రైతు స్వరాజ్య వేదిక అధ్యక్షుడు బొర్రన కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని బడగరి రమాకాంత్ అనే రైతు సాగు చేస్తున్న తెల్లజొన్న పంట పొలాన్ని ఎన్.గంగన్నతో కలిసి ఆయన సందరించి పరిలించారు. అనంతరం పక్కనే బి.స్వామి సాగు చేస్తున్న పంట పొలాన్ని కూడా సందర్శించి వారితో మాట్లాడారు.

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.2। కనిష్ఠం 22.8
నిర్మల్
జిల్లా వార్తలు
8
బుధవారం 28 ఫిబ్రవరి 2024



నేడు నర్సారెడ్డి సంస్మరణ సభ

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 27 : మాజీ మంత్రి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడు స్వర్గీయ పి. నర్సారెడ్డి సంస్మరణ సభ బుధవారం జిల్లాలోని మంజులాపూర్‌లోని మారుతి ఇన్ హోటల్‌లో సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ జి. ఈశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో జరిగే ఈ సభకు అన్ని పార్టీల నాయకులు, నర్సారెడ్డి అభిమానులు హాజరు కావాలని ఆయన కోరారు.


జిల్లాపై కార్పొరేట్ కళాశాలల

అడ్మిషన్ల వల





- ఇంటర్ అడ్మిషన్ల కోసం విద్యార్థులకు కార్పొరేట్ తాయిలాలు
- పీఆర్‌వోలతో అడ్మిషన్లు వేగవంతం
- ప్రభుత్వ ఆదేశాలూ బేఖాతర్
- పది నుంచి పాతిక శాతం వరకు రాయితీల ఎర
- ఇప్పటికే జిల్లాలో 50శాతానికి పైనే అడ్మిషన్లు పూర్తి



భైంసాలో పదో తరగతి పరీక్షల కోసం సిద్ధమవుతున్న విద్యార్థినులు

భైంసా, ఫిబ్రవరి 27

ఇంటర్ అడ్మిషన్లలో కార్పొరేట్ ఆగడాలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వ పలు ఆదేశాలను జారీ చేసింది. అందులో ముఖ్యంగా ముందస్తు అడ్మిషన్లను చేపట్టరాదని హుకుం జారీ చేసింది. అయినా పలు కార్పొరేట్ కళాశాలల తీరులో మాత్రం మార్పు రావడం లేదు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా పీఆర్‌వోలను నియమించుకుని వారి ద్వారా అడ్మిషన్ల ప్రక్రియను ఇప్పటికే వేగవంతం చేసింది. ఇప్పుడే చేరితే ఫీజులో రాయితీ అంటూ పీఆర్‌వోలు తాయిలాల ఆశ చూపిస్తున్నారు. పది నుంచి పాతిక శాతం మేర ఫీజు తగ్గిస్తామని పేర్కొంటున్నారు. ఇప్పటికే 50శాతానికి పైగా అడ్మిషన్లు పూర్తి చేసినట్లు సమాచారం. కాగా.. వీరి తీరుతో సాధారణ ప్రైవేటు కళాశాల పరిస్థితి ఇబ్బందికరంగా మారిందని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిగ్రీ తరహాలో ఆన్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టాలని వారు సూచిస్తున్నారు.

ఇంటర్ విద్య పటిష్టానికి ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ.. ఆచరణలో అవి అమలుకు నోచుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెతుత్తున్నాయి. నూతన విద్యా సంవత్సరానికి ముందస్తుగా ఇంటర్‌లో అడ్మిషన్లు తీసుకోరాదని ప్రభుత్వం గత విద్యా సంవత్సరములోనే ఆదేశాల జారీ చేసింది. అయినప్పటికీ కార్పోరేట్ విద్యా సంస్థలు చాపకింద నీరులా పీఆర్‌వోల అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహించుకుంటున్నాయి. పది ఫలితాల అనంతరం అడ్మిషన్ తీసుకుంటే ఫీజు రూ.1.5 లక్ష నుంచి రూ.2 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని, పరీక్షలకు ముందు చేరితే పది నుంచి పాతిక శాతం వరకు డిస్కౌంట్ ఆఫర్ చేస్తూ అడ్మిషన్లు పూర్తి చేసుకుంటున్నట్లు సమాచారం. ఒక పక్క ప్రభుత్వం అడ్మిషన్లు తీసుకోవద్దని చెబుతున్నప్పటికీ కార్పోరేట్ విద్యా సంస్థలు కానరాకుండా తమ పని సాఫీగా చేసుకుంటూ పోతున్నట్లు సమాచారం.

జిల్లాలో 271 ఉన్నత పాఠశాలలు

అఫ్లికేషన్ పని పూర్తి కాక ముందే గుర్తింపు ఉన్నవి, లేనివి కళాశాలలు తెరవక ముందే కార్పోరేట్ గాలం వేసే తమ కళాశాలలో చేర్చుకునేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. జిల్లాలో 166 ప్రభుత్వ, 105 ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు కలిపి మొత్తం 271 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు 6050 మంది ఉండగా.. ప్రైవేట్ పాఠశాలల్లో 2873 మంది విద్యార్థులు కలిపి మొత్తం 8923 మంది విద్యార్థులు ఉన్నారు. మార్చి మాసంలో జరగనున్న పదో తరగతి పరీక్షలకు గాను 9707 మంది రెగ్యులర్ విద్యార్థులతో పాటు మరో 43 మంది ప్రైవేట్‌లో పరీక్షలకు హాజరవుతున్నారు. ఇప్పటికే దాదాపు 4 వేల మంది పదో తరగతి విద్యార్థులు ఇంటర్ అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు సమాచారం. జిల్లాలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలలు కార్పోరేట్ కళాశాలలు అడ్మిషన్లు చేసుకోవడం పట్ల విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నారు. కార్పోరేట్ దాటికి తాము తట్టుకోలేకపోతున్నామని, డిగ్రీ తరహా ఆన్‌లైన్ అడ్మిషన్లు జరిగే విధంగా ప్రభుత్వం నిబంధనలు విధించి సాధారణ కళాశాలలు నడిచే విధంగా ప్రభుత్వం కృషి చేయాలంటున్నారు. లేదంటే ప్రైవేటు కళాశాలలు, వాటిపై ఆధారపడిన ఎందరో నిరుద్యోగులు రోడ్డున పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు చేపడుతున్న కార్పోరేట్ కళాశాలలను గుర్తించి స్థానిక ప్రైవేటు, ప్రభుత్వ కళాశాలలు బతికే విధంగా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

అడ్మిషన్ల పర్వం ఇలా..

కార్పోరేట్ కళాశాలలు పీఆర్‌వోలను నియమించుకోని వారికి నెలకు రూ. 25వేల నుంచి రూ. 35 వేల వరకు జీతం ఇవ్వడంతో పాటు అడ్మిషన్‌కు కమీషన్ ఇంత అని డిసెంబర్ నుంచే పది విద్యార్థులకు గాలాలను వేస్తున్నట్లు ప్రైవేటు అధ్యాపకులు పేర్కొంటున్నారు. ఏసీ క్యాంపస్ అయితే రూ. 2.5 లక్షలు, జేఈఈ మెయిన్స్, ఎంసెట్‌లో చేరితే రూ. 2 లక్షలు ఫీజులు అంటూ చెబుతూనే ముందస్తుగా చేరితే పది నుంచి పాతిక శాతం డిస్కౌంట్ పేరుతో అడ్మిషన్లు పూర్తి చేసుకుంటున్నట్లు సమాచారం.

నిర్మల్ పట్టణంలో పరీక్షలు రాయకముందే సుమారు 850 మంది విద్యార్థులను, భైంసా పట్టణంలో దాదాపు 350 మంది విద్యార్థులను కార్పోరేట్ విద్యా సంస్థల అడ్మిషన్ చేయించుకున్నట్లు సమాచారం. ప్రభుత్వం గత సంవత్సరం ముందస్తుగా అడ్మిషన్ చేయించుకోరాదని హుకూం జారీ చేసిన అడ్మిషన్ల పర్వం నడుస్తూనే ఉంది. నిఘా కమిటీలను ఏర్పాటు చేసి అడ్మిషన్లు చేసే కళాశాలలను గుర్తించి, వాటిపై చర్యలు చేపట్టి సాధారణ కళాశాలలు, ప్రభుత్వ కళాశాలల మనుగడ సాగించే విధంగా చూడాలని కోరుతున్నారు.



దిలావర్‌పూర్‌లో మొగి పురుగు దాడితో ఆగిన వరి పైరు ఎదుగుదల

వరి పంటపై మొగిపురుగు దాడి

- ఆందోళనలో అన్నదాతలు

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 27 : అన్నదాతను సాగు కష్టాలు వెంటాడుతున్నాయి. ఎంతో ఆశలో యాసంగి సాగు చేపట్టిన రైతులకు అడుగడుగునా కష్టాలు పలకరిస్తున్నాయి. ముఖ్యంగా వరిసాగు అన్నదాతకు హరిగోస అవుతోంది. చలితో వరి నారు చాలా చోట్ల సరిగ్గా ఎదగకపోవడంతో రైతులు చాలా నష్టపోయారు. ఎలాగో అలా ఎక్కడో ఒక దగ్గర నారు తెచ్చుకొని వరినాటు వేశారు. అయితే వరిని మొగి పురుగు ఆశిస్తుండడంతో.. రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. పురుగు ఉధృతి అన్నదాతలను కలవర పెడుతోంది. దిలావర్‌పూర్ మండలంలో దాదాపు 5,500 ఎకరాల వరకు వరి సాగు చేస్తున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వరి పైరు పిలకలు వేసే దశలు ఉండగా మొగి పురుగు ఆశిస్తుండడం దిగుబడిపై తీవ్ర ప్రభావం పడే ఆస్కారం ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 45 శాతానికి పైగా పైరును ఆశించడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. దీంతో ఇప్పటికే వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వ్యవసాయ అధికారులు సూచించిన మందులను పిచికారి చేసినప్పటికీ ఫలితం లేకుండా పోతోందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఎకరానికి రూ. 14 వేల నుంచి 15 వేల వరకు ఖర్చు చేశారు. వరి పైరును కాపాడుకునేందుకు రసాయన పురుగు మందుల కోసం మరింత ఖర్చు చేయాల్సిన పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కే. రాజన్న

ఉపాధి కోల్పోతున్న బీడీ కార్మికులు

- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కే. రాజన్న

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 27 : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల వల్ల బీడీ కార్మికులకు ఉపాధి కరువైందని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం పైనే ఉందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కే. రాజన్న అన్నారు. మంగళవారం తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా జనరల్ బాడీ సమావేశంలో రాజన్న మాట్లాడుతూ... రాత్రనకా, పగలనకా బీడీలు చుడుతూ ఉపాధి పొందుతున్న కార్మికులకు నేడు ఉపాధి దొరకని పరిస్థితి దాపురించిందన్నారు. వ్యవసాయం తర్వాత ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్న బీడీ పరిశ్రమ కేంద్రం విధానాలతో రోజురోజుకూ క్షీణిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి బీడీ కార్మికులను ఆదుకొనుటకు నెలకు రూ. 6000ల జీవన భృతి కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఆర్. రామలక్ష్మణ్, జిల్లా నాయకులు గంగామణి, లక్ష్మి, సరస్వతి, హేమంత్, రతన్ పాలివాల్ పాల్గొన్నారు.

నేటినుంచే ఇంటర్ పరీక్షలు

- జిల్లాలో ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి
- తాగునీటి వసతితో పాటు వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్న అధికారులు

భైంసా,ఫిబ్రవరి 27: జిల్లాలో బుధవారం నుంచే ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షల కోసం జిల్లాలోని ఆయా పరీక్ష కేంద్రాల నిర్వాహణాధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భైంసా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు, వశిష్ట జూనియర్ కళాశాల, రేయిన్‌బో జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మంగళవారం ఆయా పరీక్షా కేంద్రాల నిర్వహణాధికారులు ఫర్నిచర్ సమకూర్చడం, గదుల కేటాయింపు, నెంబర్లు వేయడంతో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా ఏర్పాట్లు చేపట్టారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పరీక్ష కేంద్రాల నిర్వాహకులు ఏర్పాట్లను పూర్తి చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరానికి చెందిన 374మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని డిపార్ట్‌మెంటల్ కార్గం వినోద్‌కుమార్ తెలిపారు. వశిష్ట జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రంలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 190 పరీక్షలకు రాయనున్నారని డిపార్ట్‌మెంటల్ అధికారి పద్మ, రేయిన్ బో జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రంలో ప్రథమ సంవత్సరానికి చెందిన 382 మంది విద్యార్థులు హాజరవుతున్నారని డిపార్ట్‌మెంటల్ అధికారి సంతోష్‌లు తెలిపారు. ఎండల వేడి అధికమవుతున్న నేపథ్యంలో అన్ని పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీటి వసతితో పాటు వైద్య సేవలు అందించేందుకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

కుభీర్: ఇంటర్మీడియట్ విద్యార్థులకు బుధవారం నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షల కోసం అన్నిఏర్పాట్లు పూర్తి చేసినట్లు చీఫ్ సూపరిండెంట్ పి.సునీల్‌కుమార్, డిపార్ట్‌మెంటల్ అధికారి బాలనంద్ తెలిపారు. బుధవారం మొదటి సంవత్సరం పరీక్షలకు 155 మంది విద్యార్థులు, గురువారం రెండవ సంవత్సరం 188 మంది విద్యార్థుల పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

దిలావర్‌పూర్: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేశారు. మొదటి సంవత్సరం జనరల్ విభాగంలో 197 మంది విద్యార్థులు, ఒకేషనల్ విభాగంలో 26 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా, ద్వితీయ సంవత్సరంలో జనరల్ విభాగంలో 209 మంది విద్యార్థులు, ఒకేషనల్ విభాగంలో 27 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ కే.శంకర్, అధికారి ఎం.లక్ష్మీకాంత్ తెలిపారు.

కుంటాల: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో బుధవారం నుంచి జరుగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయినట్లు చీఫ్ సూపరిండెంట్ శ్రీనివాస్‌ప్రసాద్, అధికారి టి.శ్రీనివాస్ తెలిపారు. ఈ పరీక్షల్లో 409 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు, విద్యార్థులు పరీక్షల్లో పాల్గొనేందుకు 14 గదులు ఏర్పాటు చేసి 18 మంది సిబ్బందిని ఏర్పాటు చేశారు.



భైంసాలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న నిర్వహణాధికారులు

నేడు ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక

- తమ పార్టీ కౌన్సిలర్లకు విప్ జారీ చేసిన బీఆర్‌ఎస్
- చైర్మన్ అభ్యర్థిగా రాజుర సత్యంకు కాంగ్రెస్ బీ ఫాం అందజేసిన ఎమ్మెల్యే బొజ్జు
- వైస్ చైర్మన్ కోసం తీవ్ర పోటీ



ఖానాపూర్ మున్సిపల్ కార్యాలయం (ఇన్‌సెట్‌లో కాంగ్రెస్ పార్టీ చైర్మన్ అభ్యర్థిగా ఎమ్మెల్యే బొజ్జు చేతుల మీదుగా పార్టీ బీ ఫారం స్వీకరిస్తున్న సత్యం)


ఖానాపూర్, ఫిబ్రవరి 27 : ఖానాపూర్ మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌పై ఇటీవల కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో నూతన చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియకు అధికారులు తేదీ ఖరారు చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం ఖానాపూర్ మున్సిపాలిటీ చైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నట్లు మంగళవారం మున్సిపల్ కమిషనర్ మనోహర్ తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎన్నిక ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఎన్నికల అధికారిగా జడ్పీ సీఈవో గోవింద్ వ్యవహరిస్తారన్నారు. ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయానికి హాజరైన కౌన్సిలర్లు ఎన్నికల అధికారి నిర్మల్ జడ్పీ సీఈవో గోవింద్ ఎదుట కొత్త మున్సిపల్ చైర్మన్‌ను ఎన్నుకుంటారని ఆయన పేర్కొన్నారు. చేతులు ఎత్తే పద్ధతిన ఈ ఎన్నిక ప్రక్రియ ఉంటుందని తెలిపారు. అన్ని అనుకున్నట్లుగా సాగితే ఖానాపూర్ మున్సిపల్ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ దక్కించుకోనుంది. కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న రాజుర సత్యంను చైర్మన్‌గా ఎన్నుకునేందుకు దాదాపు కౌన్సిలర్లంతా సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు రాజుర సత్యంకు కాంగ్రెస్ పార్టీ బీ ఫారం అందజేశారు. పార్టీ నుంచి మద్దతు లభించడంతో కౌన్సిలర్లంతా సత్యం వైపే మొగ్గు చూపుతుండడంతో ఇక ఖానాపూర్ మున్సిపాలిటీ రెండో చైర్మన్‌గా రాజుర సత్యం ఎన్నిక లాంఛనం కానుంది.

వైస్ చైర్మన్ ఎన్నికపై తీవ్ర పోటీ

ఖానాపూర్ మున్సిపాలిటీ చైర్మన్‌గా రాజుర సత్యం ఎన్నిక లాంఛన ప్రాయంగానే మారిన నేపథ్యంలో వైస్ చైర్మన్ ఎన్నికపై మాత్రం ఉత్కంఠ కొనసాగుతోంది. బీఆర్‌ఎస్ కౌన్సిలర్ కావలి సంతోష్, ఇండిపెండెంట్ కౌన్సిలర్ కురుమ శ్రీనివాస్‌ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఈ ఇరువురు వైస్ చైర్మన్ పదవిపై పట్టుబడుతుండడంతో.. వారిని బుజ్జగించే పనిలో చైర్మన్ అభ్యర్థిగా ప్రచారంలో ఉన్న రాజుర సత్యం తలమునకలైనట్లు రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. మరోవైపు గత వైస్ చైర్మన్ మైనారిటీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అయినందున ప్రస్తుతం నూతనంగా ఎన్నికోబోయే వైస్ చైర్మన్ సైతం తమ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తే ఉండాలని మైనారిటీ వర్గాలు పట్టుబడుతున్నాయి. ఇదివరకే కొంతమంది మైనారిటీ నాయకులు ఖానాపూర్‌లో విలేకరుల సమావేశం సైతం నిర్వహించి మైనారిటీ సామాజిక వర్గానికి మున్సిపల్ వైస్ చైర్మన్ పదవిని కేటాయించాలని పత్రికా ముఖంగా డిమాండ్ చేశారు. చైర్మన్ ఎన్నిక కోసం రాజుర సత్యంకు మద్దతు తెలుపుతున్న బీజేపీ కౌన్సిలర్ నాయిని ప్రవంతి సైతం తనకే మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి ఇవ్వాలని పట్టుబడుతున్నారు. వైస్ చైర్మన్ ఆశావాహులందరినీ బుజ్జగించేందుకు చైర్మన్ అభ్యర్థి సత్యం మంతనాలు జరుపుతున్నట్లు జోరుగా చర్చ సాగుతోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్ ప్రమాణ స్వీకారం చేసేలా అన్ని ఏర్పాట్లను చేసుకుంటున్నారు. ఇదివరకే పలుమార్లు అవిశ్వాసం వాయిదా పడుతూ వచ్చిన నేపథ్యంలో ఇక చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలో జాప్యం చేసుకోకుండా కౌన్సిలర్లంతా ఏకాభిప్రాయానికి వచ్చేందుకు జోరుగా చర్చలు జరుగుతున్నాయని చెబుతున్నారు.

బీఆర్‌ఎస్ కౌన్సిలర్లకు విప్ జారీ

పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా వెళ్లవద్దంటూ బీఆర్‌ఎస్ పార్టీ తమ కౌన్సిలర్లకు సూచించింది. ఈ మేరకు ఆ పార్టీ మండల అధ్యక్షులు తాళ్లపల్లి రాజగంగన్న కౌన్సిలర్లకు విప్ జారీ చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ గుర్తుపై ఎన్నికలలో గెలుపొందిన కౌన్సిలర్లు కావలి సంతోష్, జన్నారపు విజయలక్ష్మి, పరిమి లతలకు విప్పు జారీ చేస్తూ జిల్లా కలెక్టర్‌కు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. పార్టీ గుర్తుపై గెలిచిన వారికి కాకుండా బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ఇతర పార్టీల నాయకుల వెంట వెళ్లడం సరికాదన్నారు. పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా వెళ్తే వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయడమే కాకుండా న్యాయపరంగా తీసుకోవాల్సిన చర్యలు కూడా తీసుకుంటామని హెచ్చరించారు.



ANNEXURE - III
PARTY WHIP

బీఆర్‌ఎస్ కౌన్సిలర్లకు పార్టీ నుంచి జారీ చేసిన విప్ పత్రాలు